క్లుప్తంగా

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో నూతనంగా నిర్మించిన వినాయక ఆలయంలో బుధవారం వినాయక విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఇందుకోసం గత రెండు రోజులుగా విశ్వేశ్వరాయపురం, కత్తిమండ గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, సర్పంచ్‌లు సీహెచ్ హెలీనా, ఆర్.రంగనాయకులు, ఎంపీటీసీలు చిట్టాల శ్రీనివాస్, జీజీవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.

సత్తిబాబు కుటుంబానికి ఆర్థిక సాయం



సత్తిబాబు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న తెలగా సంఘ నాయకులు

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక గ్రామానికి చెందిన జక్కంపూడి సత్తిబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద అయిన సత్తిబాబు కుటుంబానికి గ్రామ తెలగ సంక్షేమ సంఘం అండగా నిలిచింది. సంఘ సభ్యులు సమకూర్చిన రూ.52 వేలను బుధవారం సత్తిబాబు కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మేడిచర్ల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ సత్తిబాబు కుటుంబాన్ని ఆదుకోవాడానికి ముందుకు వచ్చిన దాతలందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, తోట బాబులు, తిరుమల ఏసుబాబు, వీఆర్ఓలు తోట వెంకట శ్రీనివాస్, తోట విస్సు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈ బదిలీ

అంబాజీపేట: ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ అంబాజీపేట ఏఈ పలివెల రమేష్‌కుమార్ బదిలీ అయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రమేష్‌కుమార్ సామర్లకోట ఏఈగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టినట్లు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. అయినవిల్లి ఏఈ హరిబాబు అంబాజీపేట ఇంచార్జిగా వ్యవహరించనున్నారు.

ఎంపీడీఓకు ఘన సత్కారం

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్‌కు బుధవారం ఘన సత్కారం జరిగింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ అవార్డుకు ఎంపికైన ఎంపీడీఓను శ్రీకృష్ణదేవ రాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు నేతృత్వంలో కాపు నేతలు పూలమాల వేసి ఘనంగా సత్కరించి మెమెంటోను బహూకరించారు. రామానుజుల శేషగిరి రావు, చల్లా నానాజీ, శిరిగినీడి పట్టాభి, భూషణం తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యం

కొత్తపేట: 2023–24 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉందని రాష్ట్ర బీజేపీ స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం అన్నారు. అన్ని రంగాలకు కేటాయింపులు చేసిన బడ్జెట్ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రూపొందించిందన్నారు. ద్రవ్యలోటును 5.9 శాతానికి పరిమితం చేస్తూ మౌలిక వసతుల అభివృద్ధికి గతం కంటే 33 శాతం ఎక్కువ కేటాయించారన్నారు.

గడ్డివామి దగ్ధం

రావులపాలెం: రావులపాడులో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు వివరాల ప్రకారం శివాలయం సమీపాన మేకా వెంకటేశ్వరరావుకు చెందిన పశువుల మకాం ఉంది. సుమారు ఆరు ఎకరాల పంట కోయగా వచ్చిన ఎండుగడ్డిని మేటుగా వేశాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి పడేసిన సిగరెట్ వల్ల మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలు అదుపుచేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.20 వేల విలువైన గడ్డి దగ్ధమైనట్టు రైతు వాపోయాడు.

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ నిత్యాన్నదాన ట్రస్టుకు ఫ్రెంచి యానంకు చెందిన అన్యం సత్యనారాయణ స్మారకార్థం అతని సతీమణి రత్నమాల, ఆమె కుటుంబ సభ్యులు బుధవారం రూ.25 వేల విరాళం అందించారు. మామిడికుదురుకు చెందిన దీప్తి విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ, భ్రమరాంబ దంపతులు రూ.10 వేలు విరాళం అందించారు. ఈ విరాళాలను ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ట్రస్టు బోర్డు ఛైర్మన్ సీహెచ్ రామకృష్ణకు అందజేశారు. దాతలకు స్వామి చిత్రపటం,ప్రసాదాలు అందజేశారు.

జన'సంద్ర'మైన అంతర్వేది



అంతర్వేదిలో తీర్థంలో భక్తుల సందడి



సముద్రస్నానాల్లో యువత కేరింత



పెద్దలకు పిండ తర్పణాలిస్తున్న వారి కుటుంబసభ్యులు

భీష్మఏకాదశి, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి తీర్థం సందర్భంగా బుధవారం భక్తులు భారీగా పోటెత్తారు. సముద్రస్నానాలు, పిండతర్పణాలు, రంగులరాట్నాల హడావుడి, స్వామి దర్శనం, రథోత్సవాలకు జనం తండోపతండాలుగా హాజరయ్యారు. ఎక్కడ చూసినా పిల్లలు, యువత కేరింతలతో సందడి చేశారు. నరసన్న రథోత్సవానికి వివిధ రాష్ట్రాలు, జిల్లాలు, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు. ఆలయ ప్రాంగణమంతా ఎంతో కోలాహలంగా మారింది.

ప్రతిభా పరీక్షకు వేళాయె..

- 5న ఎన్ఎంఎంఎస్ పరీక్ష
- డివిజన్ కేంద్రం కొత్తపేటలో తొలిసారి పరీక్ష



కొత్తపాలెం పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తపేట: పేద ప్రతిభా విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ద్వారా ఆర్థిక ప్రోత్సాహక పరీక్షకు సమయం సమీపించింది. ప్రతిభ ఉండి ఆర్థికస్తోమత లేక ఎందరో విద్యార్థులు ముఖ్యంగా విద్యార్థినులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. పాఠశాల విద్యను ఎలాగోలా పూర్తి చేసినా ఇంటర్మీడియెట్‌కు వచ్చేసరికి వివిధ కారణాల వలన ముఖ్యంగా ఆర్థికలేమితో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నారు. దీనిని గమనించిన కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఎనిమిదో తరగతి చదువుచున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే విధంగా పరీక్ష నిర్వహించి, ఆ పరీక్షల్లో ప్రతిభను చాటిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తి చేసే వరకూ ఆర్థికసాయం అందజేస్తుంది. ఏడాదికి రూ.12 వేలు చొప్పున 4 ఏళ్లలో రూ.48 వేలు ప్రోత్సాహం అందిస్తున్నారు. అలా గతేడాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో సుమారు 2,600 మంది పరీక్షకు హాజరు కాగా 137 మంది ఎంపికయ్యారు. ఈ ఏడాది 2,665 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు. మరింత మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం, ఆదేశాల మేరకు, ప్రతి పాఠశాల నుంచి విద్యార్థుల్లో పెరిగిన పోటీతత్వాన్ని గుర్తించిన ఉపాధ్యాయులు గత నాలుగు నెలలుగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

కొత్తగా కొత్తపేట సెంటర్ ఏర్పాటు

రెవెన్యూ డివిజన్ కేంద్రం సెంటర్‌లో ఈ పరీక్ష నిర్వహించగా గత ఏడాది వరకూ కొత్తపేట నియోజకవర్గంలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలతో పాటు అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం మండలాలలకు చెందిన విద్యార్థులు అమలాపురం, రామచంద్రపురం వెళ్లి పరీక్ష రాయవలసి వచ్చేది. అయితే కొత్తగా కొత్తపేట కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పడటంతో ఇక్కడ ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో 908 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్టు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తెలిపారు.

మెళకువలు నేర్చుకున్నా..



ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దాదాపు నాలుగు నెలల నుంచి మా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పరీక్షలో ఇచ్చే ప్రశ్నలకు సంబంధించి మెళకువలు నేర్పారు. కష్టపడి చదువుకుంటున్నాను. మంచి మార్కులతో స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలన్న లక్ష్యంతో సన్నద్ధమవుతున్నాను.

– వనుము జయశ్రీమానస, 8వ తరగతి, కొత్తపాలెం

విద్యార్థుల్లో పోటీ పెరిగింది



ఈ పరీక్ష గ్రామీణ ప్రాంతాల్లో, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఓ వరం. దీంతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగింది. కొత్తగా కొత్తపేట డివిజన్ ఏర్పడటం, ఇక్కడ పరీక్ష కేంద్రం రావడంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లవలసిన ఇబ్బందులు తప్పాయి.

– ఎం.హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

సంక్షేమ సారథికి అండగా ఉందాం



పసుపల్లిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- పసుపల్లిలో గడప గడపకూ..

అంబాజీపేట: ఇంటింటికీ సంక్షేమాన్ని చేరువ చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని పసుపల్లి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను వింటూ ప్రభుత్వం పంపిణీ చేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ బ్రోచర్లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల పంపిణీతో పాటు పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత దేశ చరిత్రలో సీఎం జగన్‌కి మాత్రమే దక్కుతుందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా పథకాల లబ్ధి నేరుగా బ్యాంకు ద్వారా అందిస్తున్న తీరును ప్రజలందరూ అభినందిస్తున్నారన్నారు. పది కాలాలపాటు జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుందామని ప్రజలు చెబుతుండడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే చిట్టిబాబును గ్రామస్తులు కోరారు. దానికి ఆయన ప్రతిస్పందిస్తూ అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు, సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, నేతల నాగరాజు, వాసంశెట్టి చినబాబు, పెదబాబు, ముత్తాబత్తుల ప్రశాంత్, నాగవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి జీన్ బ్యాంక్ నూతన ప్రయోగం



అంబాజీపేటలో కొబ్బరిజీన్ బ్యాంక్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: కొబ్బరిలో సంకరీకరణ చేసిన మొక్కలతో పాటు వివిధ రకాల కొబ్బరి మొక్కలను ఒకే చోట సాగు చేసేందుకు ఏర్పాటు చేసిన కొబ్బరి జీన్ బ్యాంక్ ఒక గొప్ప ప్రయోగమని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర బి.శ్రీనివాసులు అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి సంకరీకరణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు జరుగుతున్న శిక్షణలో ముఖ్యఅతిథిగా శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ కొబ్బరిలో మేలైన రకాలు, సంకరజాతి వంగడాలపై వివరించారు. స్థానిక పరిశోధన కేంద్రం విడుదల చేసిన ఐదు దేశవాళీ, నాలుగు హైబ్రీడ్ రకాలను జీన్ బ్యాంక్ పేరుతో ఒకే చోట సాగు చేయడం మంచి ప్రయోగమన్నారు. అనంతరం పరిశోధన కేంద్రంలోని కొబ్బరి జీన్ బ్యాంక్ జీవ నియంత్రణ ఉత్పత్తి ప్రయోగశాలలను సందర్శించారు. కేంద్ర అధిపతి డాక్టర్ శ్రీనివాసులు పరిశోధన కేంద్రంలో జరుగుతున్న ప్రయోగాలను అభివృద్ధిపై వివరించారు. కొబ్బరిలో సంకరీకరణలో భాగంగా కొబ్బరిని ఆశించే కీటక, చీడపీడలను గుర్తించడం వాటి యాజమాన్య పద్ధతులపై సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.అనూష, బి.నీరజ, డాక్టర్ వి.గోవర్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రారంభం



ఆర్యవైశ్య కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: రాజోలులో రూ.1.50 కోట్లతో నిర్మించిన శ్రీ వాసవి ఆర్యవైశ్య బలభద్ర రాయుడు కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు బుధవారం ప్రారంభించారు. సంఘ సభ్యులు కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. లలితా రైస్ ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్ కల్యాణవేదిక ప్రారంభించగా మొదటి అంతస్తు భవనాన్ని వ్యాపారవేత్త కంచర్ల సోమశేఖర్‌గుప్త, డైనింగ్ హాలును ఉమ్మడి జిల్లా ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు(బాబి) ప్రారంభించారు. రాజోలు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ఆర్య వైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఈ ప్రాంత వాసులకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. రాజోలులో కల్యాణమండపం నిర్మించిన సంఘ సభ్యులను అభినందించారు. ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, దార్ల కుమారిలక్ష్మి, సంఘ కార్యదర్శి కేఎస్ఆర్ఎస్ మూర్తి, కోశాధికారి చలువాది త్రినాథ్, మహిళా విభాగ అధ్యక్షురాలు కాసు భవాని, కొత్త పద్మావతి, కోదాటి దుర్గ, కొత్త శ్రీనివాసరావు, రాజా నాగరత్నకుమార్, కాసు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం



అమలాపురంలో రక్తదానం చేస్తున్న యువకులు

కొత్తపేట: స్థానిక వివేకానంద యోగా శిక్షణా కేంద్రం సభ్యులు అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేశారు. మండలంలోని మోడేకుర్రు శివారు రాకుర్తివారిపాలెం గ్రామానికి చెందిన గుత్తుల భాస్కరరావు బైపాస్ సర్జరీకి రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతనికి అత్యవసరంగా బ్లడ్ ఎక్కించాల్సి వచ్చింది. అలాగే అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న యానంకు చెందిన సాధనాల మరియమ్మకు అత్యవసరంగా బ్లడ్ ఎక్కించాల్సి వచ్చింది. దాంతో పై వ్యక్తుల కుటుంబ సభ్యులు వివేకానంద యోగా శిక్షణ కేంద్రం మాస్టర్ ఆకుల శ్రీనివాస్‌ను సంప్రదించారు. ఆయన తన శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న కుంపట్ల నరీన్, కొప్పాడి రాము, బి.రవితిలక్, జె.సురేష్, అంగులూరి రాజారవికాంత్‌లను అమలాపురం తీసుకువెళ్లి రక్తదానం చేయించారు. శ్రీనివాస్‌కు, రక్తదాతలకు భాస్కరరావు, మరియమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రథోత్సవం



పుష్పాలంకరణలో నల్లచెరువు పట్టాభిరామచంద్రస్వామి

ఆలమూరు: భీష్మ ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని ఆలమూరులో శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన రథోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు, సన్నాయి వాయిద్యాలు, బ్యాండు మేళ, తాళాల మధ్య ఈరథయాత్ర ఆలయం వద్ద నుంచి గ్రామ పొలిమేరల వరకూ కొనసాగింది. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి రథయాత్రలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. జయ జయ ధ్వానాల మధ్య భక్తులు రథాన్ని తాళ్లతో లాగుతూ భక్తి పారవశ్యం పొందారు. రథయాత్రకు ఆటంకం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు తొలగించిన విద్యుత్ సర్వీస్ కనెక్షన్లను యాత్ర అనంతరం పునరుద్ధరించారు. రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఎస్.శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బారీ బందోబస్తు నిర్వహించారు.

కిక్కిరిసిన ఆలయాలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు వేంకటేశ్వరుని ఆలయం, చింతనలంక వేంకటేశ్వరుని ఆలయం, అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం భక్తులతో కిక్కిరిశాయి. నల్లచెరువు వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వేంచేసిన పట్టాభిరామచంద్రస్వామిని ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, అర్చకులు పెదపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

షిరిడిసాయి ఆలయ వార్షికోత్సవం

అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో షిరిడి సాయిబాబా 28 వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిపారు. మల్లాది మల్లిబాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా సాయిబాబాకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గుత్తుల మీరా సాయికుమార్, లక్ష్మి దంపతులు సాయిబాబా ఆలయ నిర్వాహకులకు వెండి పాదుకలు, రూ. పదివేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రథయాత్ర సందర్భంగా పాల్గొన్న ప్రముఖులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని రథయాత్రలో బుధవారం పాల్గొన్న ప్రముఖులు వీరే. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, అమలాపురం, కొత్తపేట డీఎస్పీలు వై.మాధవరెడ్డి, కేవీ రమణ, అమలాపురం ఆర్డీవో ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు, ఎండోమెంట్స్ డీసీ, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ యం.విజయరాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, మావుళ్ళమ్మ ఏసీ వై.భద్రాజీ, ఎస్సై అడపా ఫణిమోహన్, తహసీల్దార్ వై.రామకుమారి, ఎంపీడీవో జి.భీమారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త జంపన సత్యనారాయణ రాజు, వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒగుడు శ్రీను, ఎంపీటీసీలు బైర నాగరాజు, పోతాబత్తుల భాస్కరరావు, మాజీ సర్పంచ్‌లు వనమాలి మూలాస్వామి, కొల్లాటి నరసింహస్వామి పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి సందర్భంగా ఏకాహం

మామిడికుదురు: భీష్మ ఏకాదశి పురస్కరించుకుని మండలంలోని పలు రామాలయాల వద్ద బుధవారం ఏకాహం నిర్వహించారు. దీనిలో భాగంగా పెదపట్నంలంక బొక్కావారిపాలెం రామాలయం వద్ద మాజీ ఎంపీటీసీ జోగి వెంకటరామకృష్ణ, పావని దంపతుల ఆధ్వర్యంలో కలశ స్థాపన జరిగింది. ఇక్కడ ఏకాహం జరిగింది. పాశర్లపూడి, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద పలు భజన బృందాల ఆధ్వర్యంలో 24 గంటల పాటు నిరంతరాయంగా శ్రీరామనామ సర్వనామ కీర్తనలతో ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు.

ఆలయానికి శంకుస్థాపన



వేంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ తమ్మన సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూజలు నిర్వహించారు. గ్రామాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దిన సర్పంచ్ తమ్మనను ఆయన అభినందించారు. ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. దొండపాటి చంటి, బుద్ధిగ వీర వెంకట్రావు, అడబాల శ్రీనివాసు, మోటూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశుసంచార వైద్యంతో పాడి రైతుకు మేలు

అయినవిల్లి: పశుసంచార వైద్యంతో పాడి రైతులకు మేలు చేకూరుతోందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు పశుసంచార అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కొత్తపేటలో సీసీ డ్రైన్ పనులు ప్రారంభించిన ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరోపక్క మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్లు, డ్రైన్లు, వివిధ ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. బుధవారం స్థానిక కొత్తరామాలయం వద్ద మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో నిర్మించే సీసీ డ్రైన్ నిర్మాణానికి ఎంపీపీ మార్గన కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీలు విళ్ల వీర్రాజు, రేవాడి నాగలక్ష్మి, మండల సేవాదళ్ కన్వీనర్ జి.ప్రవీణ్‌కుమార్, పార్టీ బీసీ విభాగం సభ్యుడు రేవాడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీర్థంలో పారిశుధ్య పనుల్లో సిబ్బంది



సముద్రం ఒడ్డుకు వెళ్లే మార్గంలో శానిటేషన్ పనులు నిర్వహిస్తున్న సిబ్బంది



తీర్థంలో బ్లీచింగ్ పనులు చేస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేదిలో ఈ నెల 28 నుంచి మొదలైన లక్ష్మీనృసింహుని తీర్థమహోత్సవాల్లో పంచాయతీరాజ్ ఆధ్వర్యాన శానిటేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రధానంగా గత రెండు రోజులుగా కల్యాణం, రథోత్సవంలో ఈ పనులు మరింత మెరుగ్గా చేసేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన 200 మంది కార్మికులు 150 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజాము నుంచి తీర్థంలోను, సముద్రం ఒడ్డున సైతం శానిటేషన్ పనుల్లో సిబ్బంది నిమగ్నమై భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూస్తున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



ఊడిమూడి ఆలయం వద్ద పూర్ణకుంభంతో చిట్టిబాబుకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

పి.గన్నవరం: చిన అంతర్వేదిగా పేరుగాంచిన లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. వాడపల్లి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి పూజలు జరిగాయి. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కల్యాణంలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. చిట్టిబాబుకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉదయం స్వామివారి తీర్థం వైభవంగా జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఆలయ ఈఓ గంధూరి వెంకటేశ్వరరావు, పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.